పుస్తకాలు వచ్చేశాయ్!

- గోదాము నుంచి మండలాలకు పాఠ్య పుస్తకాల సరఫరా
- జిల్లాకు పార్టు-1 మొత్తం పాఠ్యపుస్తకాలు 5.49 లక్షలు
- బడులు ప్రారంభం రోజే విద్యార్థులకు పంపిణీకి చర్యలు

నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి 20 రోజుల ముందుగానే బడులకు పుస్తకాలను తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రంలోని గోదాంకు చేరాయి.

– సాక్షి,సిటీబ్యూరో



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని రామంతాపూర్ గోదామ్ నుంచి మండల కేంద్రాలకు పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో యూడైస్ ప్లస్ వివరాల ప్రకారం.. మొత్తంగా 7.72 లక్షల పాఠ్యపుస్తకాలతో సహా వర్క్‌బుక్స్ రావాల్సి ఉందని, జిల్లా విద్యా శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. జిల్లాకు పార్టు-1 కింద 5,49,630 పాఠ్యపుస్తకాలు అవసరమని అంచనా వేయగా.. ఇప్పటివరకు 4,63,150 పాఠ్య పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. ఇంకా 86,480 పుస్తకాలు రావాల్సి ఉంది. జిల్లాలో మొత్తంగా 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో 85,465 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

రెండు భాగాలుగా అందజేత

ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, ఆదర్శ పాఠశాలలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తుంది. వీటిని పార్ట్-1, పార్టు-2లుగా విభజించి సరఫరా చేస్తారు. జిల్లాకు పార్టు-2 కింద 2,23,370 వర్క్‌బుక్స్, వర్క్‌షీట్లు, స్టూడెంట్ వర్క్‌షీట్స్ తదితర పుస్తకాలు రావాల్సి ఉండగా.. ఇవి ఆగస్టు నాటికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాఠ్యపుస్తకాలను మండలాల వారీగా ఎంఈవోల సమక్షంలో పంపిణీకి జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

20 నుంచి పాఠశాలలకు..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని మండల కేంద్రాల్లో ఈనెల 20న యూపీఎస్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండో విడతలో భాగంగా బోధన పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలోనే పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను అందించాలని విద్యాధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడులు ప్రారంభమయ్యేనాటికి పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. పుస్తకాలు పక్కదారి పట్టకుండా వాటిపై వరుస సంఖ్యలను ముద్రించారు. వీటి ఆధారంగా ఎన్ని మండలాలకు, ఏయే పాఠశాలలకు పుస్తకాలు అందాయన్నది' రికార్డుల్లో పక్కాగా తేలనుంది. 1-10 తరగతుల విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లో ఓ వైపు తెలుగు, మరోవైపు ఆంగ్ల మాధ్యమంలో పాఠాలను ముద్రించారు. 3-10 తరగతుల వారికి పార్టు-1, పార్టు-2 పంపిణీ చేయనున్నారు. ఈ విధానంలో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గనుంది. పుస్తకాల్లోని ప్రతి పాఠానికి బార్ కోడ్ ముద్రించడంతో సెల్‌ఫోన్‌తో స్కాన్‌చేస్తే ఆ పాఠాన్ని వీడియో రూపంలోనూ చూసుకునే సదుపాయముంటుంది.

84 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయి..



జిల్లాకు ఇప్పటి వరకు 84 శాతం పుస్తకాలు వచ్చాయి. మిగతావి వారం రోజుల్లో వస్తాయి. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు ఎంఈవోల సమక్షంలో పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం..మిగిలిన 16 శాతం పుస్తకాలు త్వరలో వస్తాయి. బడుల ప్రారంభం రోజే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేయాలనుకుంటున్నాం.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్, మల్కాజిగిరిజిల్లా

సీఎం రిలీఫ్ ఫండ్‌తో భరోసా



కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేదల్లో భరోసా నెలకొందని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో శ్రీనివాస్‌కు రూ.44 వేలు, ముజీబ్‌కు రూ.38 వేలు, శేఖర్‌గౌడ్‌కు రూ.60 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బులాపూర్: జీడిమెట్ల డివిజన్ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విశ్వకర్మ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ది రాములు, కాలే నగేశ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లాగౌడ్, కాలే గణేశ్, నదీంరాయ్, మోహన్ రెడ్డి, బాల మల్లేశ్, విజయ్ హరీశ్, సత్యనారాయణ యాదవ్, ఆలయ చైర్మన్ అన్నోజు భానురి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల వెంట ఆక్రమణలు తొలగించండి



ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

సుభాష్‌నగర్: ప్రధాన రోడ్డుపై ఆక్రమణలతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, తగు చర్యలు చేపట్టాలని కోరుతూ మహదేవపురం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ప్రజావాణిలో ఉప కమిషనర్ మల్లారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. రోడ్డుపై వ్యాపార దుకాణాలు వెలియడంతో 100 ఫీట్ల రోడ్డు 40 ఫీట్లకు కుచించుకుపోయిందని వినతిలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. కాలనీ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, రంగారావు, సంయుక్త కార్యదర్శ రామచంద్రారెడ్డి, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

రహదారులను విస్తరించాలని బీజేపీ నాయకుల వినతి



హెచ్ఆర్‌డీసీఎల్ ఎండీ ఇలంబర్తికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిజాంపేట్: రహదారులను విస్తరించాలని కోరుతూ బీజేపీ నాయకులు సెక్రటరియేట్‌లో హెచ్ఆర్‌డీసీఎల్ ఎండీ ఇలంబర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ మెట్రో నుంచి బాచుపల్లి ఎక్స్ రోడ్డు వరకు, జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ ప్రధాన రహదారి వరకు విస్తరించి ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రాజు, నరేంద్ర చౌదరి, శ్రీధర్‌రెడ్డి, సంతోష్‌కుమార్‌గౌడ్, ఉదయ్ కిరణ్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

మోతీనగర్: నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మేనేజర్లు రాజశేఖర్, సంపత్‌కుమార్, ఐ క్రియేట్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రావణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి మెట్రో పిల్లర్ నంబర్ ఏ827, ఐ క్రియేట్ కాలేజీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మేళా కొనసాగుతుందని తెలిపారు. జావా, వెబ్ డిజైనింగ్ డెవలప్‌మెంట్, కాడ్ ఇంజినీరింగ్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఆటో మొబైల్స్, బ్యాంకింగ్, ఫార్మసీ, బీపీవో కంపెనీలు రానున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9154084728, 9963172858 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ప్రజావాణికి 22 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 22 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 8 ఫిర్యాదుల్లో టౌన్ ప్లానింగ్ 1, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 7 ఫిర్యాదులు వచ్చాయి. అలాగే గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 14 ఫిర్యాదులు రాగా, ఇంజినీరింగ్‌కు సంబంధించి 7, ఎలక్ట్రికల్ 3, టౌన్ ప్లానింగ్ 3, డ్రైనేజీకి సంబంధించి 1 వచ్చిందని అధికారులు తెలిపారు. వాటిని ఆ శాఖ అధికారులకు పంపించామని పేర్కొన్నారు.

ఘనంగా శ్రీవారి మాస కల్యాణోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో కుట్టుల వెంకటేశ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యుడు రామాచారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

నిజాంపేట్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో 125 డివిజన్ రుడా మేస్త్రీనగర్ వాసులు, వాసవీ ఎన్‌క్లేవ్ వాసులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని అలాగే మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కైసర్‌నగర్‌లోని డబుల్‌బెడ్రూం ఇండ్లు కేటాయించాలని, వాసవీ ఎన్‌క్లేవ్‌లోని వార్డు నంబర్ 22లో పలు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆయన స్పందిస్తూ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎంసీ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మేడ శ్రీనివాస్‌రావు, ఆల్ ఇండియా దళిత సేనా అధ్యక్షుడు డా.అవిజే జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్‌కుమార్, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, ఎండీ అజమ్ తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'లో పేర్లు చేర్చాలని రైతుల వినతి



కలెక్టరేట్‌లో అర్జీ అందజేస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ 166 సర్వే నంబర్ లావణ్య పట్టా భూమిని భూ భారతి ఆన్‌లైన్‌లో చేర్చి రైతులకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని బీజేపీ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 166 లో 316 ఎకరాల లావణ్య పట్టా భూమిని 136 రైతులకు కేటాయించారన్నారు. అయితే 2016 ధరణిలో రైతుల పేర్లు నమోదు కాకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అడ్డుకున్నారని, ప్రస్తుత భూభారతి వెబ్‌సైట్‌లో నైనా వారి పేర్లు నమోదు చేయాలని ఆధారాలతో అర్జీలు అందజేశామన్నారు. నాయకులు ప్రభాకర్ రెడ్డి, అరుణ్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, రాము, శ్రీపాల్ రెడ్డి, రైతులు శ్రీనివాస్ రెడ్డి, తలారి రాము, జీతయ్య, బాలాగారి బలరాం, కొమ్ము వీరయ్య, దుర్గేశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

తండా జీపీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలి



ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట్: తెలంగాణలోని 33 జిల్లాల్లో నూతనంగా ఏర్పడిన తండా పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని కోరుతూ సేవాలాల్ సేనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రనాయక్ చౌహాన్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండా పంచాయతీలో స్థానిక ఉద్యోగాలను గిరిజనులకే ఇవ్వాలని, పంచాయతీల సమగ్ర అభివృద్ధికి తండా అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఏటా పంచాయతీకి రూ. కోటి నిధులు కేటాయించాలని, సంక్షేమ పథకాల్లో గిరిజనులకు అవకాశాలు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో రామ్ నాయక్, కొర్ర రాములు, నాగరాజు, శ్రీనివాసులు, గోపి నాయక్ పాల్గొన్నారు.

22న హిందూ ఏక్తాయాత్ర



కూకట్‌పల్లి: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బాలాజీనగర్ కాలనీలో కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో మే 22న హిందూ ఏక్తా యాత్ర నిర్వహించనున్నట్లు కన్వీనర్ పవన్ తెలిపారు. యాత్ర రూట్ మ్యాప్, కాషాయ అలంకరణ, ఉత్సవ విగ్రహాలు, రథం, ప్రసాద వితరణ, తాగునీరు, పోలీస్ బందోబస్తు వంటి అనేక అంశాలపై కమిటీ సభ్యులు సోమవారం చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు వినోద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై బాలాజీనగర్ కాలనీలోని శ్రీ సంజీవిని హనుమాన్ ఆలయం నుంచి కూకట్‌పల్లి రామాలయం వరకు యాత్ర కొనసాగుతుందని యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యాత్ర నిర్వాహకులు వినోద్, సోమశేఖర్ రెడ్డి, తోట రమేశ్, భగవంత్ రెడ్డి, గట్ల సంతోష్, ప్రేమ్‌కుమార్, సాయి, శివ, సురేశ్, రవి, విజయ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ ముద్దం నరసింహాయాదవ్ తెలిపారు. రాజరాజేశ్వరి హౌసింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సోమవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, ఓపెన్‌జిమ్, ఎలక్ట్రికల్ పంచ్ కేబుల్, రోజువారీ పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేపట్టడం లేదని రాజరాజేశ్వరి నగర్‌వాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్‌వర్క్స్ మేనేజర్ తేజ, శ్రీనివాస్, ప్రకాశ్, రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నరసింహాయాదవ్

జలమండలి కార్యాలయంలో ప్రజావాణి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీఎం అశోక్

చింతల్: వేసవిలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టామని కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ అశోక్ అన్నారు. తన అధ్యక్షతన సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా 5 ఫిర్యాదులు వచ్చాయి. సూరారం సెక్షన్ రాజీవ్ గాంధీనగర్‌లోని రోడ్డు నంబర్-33 లోని చేతి పంపునకు మరమ్మతులు చేపట్టాలని శ్రీనివాస్, ఉషోదయ సెక్షన్ వల్లభాయ్ పటేల్ నగర్‌లో తాగునీరు సరఫరా కావడం లేదని వెంకటేశ్ ఫిర్యాదు చేశారు. అలాగే సుచిత్ర సెక్షన్ పద్మానగర్ ఫేస్-2లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు ఏర్పాటు చేయాలని, చింతల్ సెక్షన్ మాణిక్యనగర్‌లో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జీఎం పరిష్కరిస్తామని హామీనిచ్చారు. డీజీఎంలు రాజేశ్, వికాశ్ రవి, ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్నాథ్, మేనేజర్లు పాల్గొన్నారు.

పేట్‌బషీరాబాద్ ఏసీపీగా బాలగంగిరెడ్డి

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ ఏసీపీగా బాలగంగిరెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఏసీపీగా ఉన్న రాములు డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో ఏసీపీ ఎస్‌బీ కార్యాలయంలో పనిచేస్తున్న బాలగంగిరెడ్డి ఇక్కడికి బదిలీ అయ్యారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ నిరుపేద వృద్ధ మహిళలకు బియ్యం, నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్య, ఆమె బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ, సమాజసేవ చేయాలనే ఉద్దేశంతో బృందంగా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు షౌకత్ ఆలీ మున్నా, వెంకటేశ్వరరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోడ కూల్చివేత



జేసీబీతో గోడను కూల్చివేయిస్తున్న అధికారులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, భాగ్యనగర్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన గోడను హైడ్రా అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య సోమవారం కూల్చివేశారు. భాగ్యనగర్‌కాలనీలోని ఓ ఇంటి ఎదుట ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి షెడ్డు ఏర్పాటు చేశాడు. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారు లు జేసీబీతో కూల్చివేశారు. ఎన్నో ఏళ్లుగా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంపై వారు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీని సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ..పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల్లో ఎక్కువగా దళితులే ఉన్నారని వారిపై వివక్ష చూపడం తగదన్నారు. అలాగే ప్రతి 6 నెలలకు ఒకసారి సబ్బులు, కొబ్బరినూనె, చీపుర్లు అందించాలని విన్నవించారు. కమిషనర్ స్పందిస్తూ.. స్టేట్ ఫైనాన్స్ వద్ద పెండింగ్ ఉందని, ప్రభుత్వం క్లియర్ చేయగానే వేతనాలు విడుదల అవుతాయన్నారు. అలాగే డ్యూటీలోని కార్మికులకు అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే వారు పనికి రాలేనన్ని రోజులు వేతనం చెల్లిస్తామని కమిషనర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనారాయణ, రాముడు, లింగమ్మ, అలివేలు, లక్ష్మి, మణి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆగుతూ..సాగుతూ..!

నత్తనడకన భూగర్భ డ్రైనేజీ పనులు



డ్రైనేజీ కోసం తవ్విన గుంత

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సాయినగర్, రామకృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 2 లేదా 3 గంటలే డ్రైనేజీ పని చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ గుంతలను లోతుగా తవ్వడంతో మట్టి కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడంతో కాలనీల్లోకి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీనికితోడు డ్రైనేజీ లైన్ తవ్వుతుండగా తాగునీటి లైన్లు కూడా దెబ్బతిన్నాయని దీంతో సక్రమంగా నీరు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డీపోచంపల్లి డబుల్‌బెడ్రూం కాలనీ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధికి సహకరించాలని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డీపోచంపల్లి డబుల్‌బెడ్రూం కాలనీ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాస్కర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా నగేశ్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ చాంద్, కోశాధికారిగా మధు, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మి, సలహాదారుడిగా వినోద్ నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి నూతన కమిటీ సభ్యులను అభినందించి మాట్లాడారు. డబుల్ బెడ్రూం సముదాయంలో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



వర్ధంతిలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మండల సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో శంషీగూడలోని ఇంద్ర హిల్స్‌లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మండల కార్యదర్శి ఎం. శంకర్, నాయకులు వి. శివప్రసాద్, కె. కృష్ణ నాయక్, లక్ష్మీపతి హాజరై మాట్లాడుతూ.. సుందరయ్య చిన్నప్పటి నుంచే కులాలు, మతాలకు వ్యతిరేకంగా సమాజం కోసం ఇంటి నుంచి పోరాటాన్ని కొనసాగించారన్నారు. గాంధీజీ ఇచ్చిన పిలుపులో భాగంగా స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారని, తదనంతరం కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి తన జీవితాంతం సీపీఎంలో కొనసాగారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చందర్‌నాయక్, ప్రకాశ్‌రాజు, రామకృష్ణ, శ్రీనునాయక్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



బాలానగర్: ఫతేనగర్ డివిజన్ శివాలయం సమీపంలోని ఇండస్ట్రీయల్ ప్రాంతంలోని కురుమ కులస్తుల శ్మశాన వాటికలో కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ కురుమ కులస్తులతో కలిసి పలు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 31 లక్షల నిధులతో పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కంచి మహేందర్, కంచి స్వామి, కంచి చిట్టిబాబు, కంచి శివ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి హిందు శ్మశాన వాటికలో..

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి హిందు శ్మశాన వాటికలో రూ. 45 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ప్రహరీ, వెయిటింగ్ హాల్, గేట్లు, ఇతర పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ ఆశ, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, గణేశ్ చారి, రాజు యాదవ్, మధుయాదవ్, శ్రీధర్ యాదవ్, సుందర్, మల్లేశ్‌యాదవ్, సునంద పాల్గొన్నారు.